క్లుప్తంగా

మారెమ్మ దేవతకు పూజలు



అలంకరణలో మారెమ్మ

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామంలో మారెమ్మ దేవత అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళారతి, భక్తులకు అన్నదానం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

కాకినాడకు శిల తరలింపు



వాహనంలో శిలను తీసుకెళుతున్న దృశ్యం

మడకశిరరూరల్: రొళ్ల మండలం నుంచి కాకినాడకు పెద్ద వాహనంలో 20 అడుగుల ఎత్తు, 40 అడుగుల పొడవు ఉన్న శిలను ఆదివారం మడకశిర మీదుగా తరలించారు. కాకినాడులో రంగనాథస్వామి దేవాలయంలో ఏకశిలా విగ్రహం కోసం శిలను తరలిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానికులు శిలను ఆసక్తిగా తిలకించారు.

గిరి ప్రదర్శనకు బస్సుల ఏర్పాటు



అరుణాచలం యాత్రను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ పార్వతి

హిందూపురం: మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పార్వతి ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదర్శనకు రెండు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. వార్డులోని సుమారు 70 మంది ఆర్టీసీ బస్సుల్లో ఆదివారం సాయంత్రం బయలు దేరారు. అరుణాచల క్షేత్ర దర్శనంతో పాటు పరిసర క్షేత్రాలను దర్శించుకుని తిరిగి పట్టణానికి చేరుస్తామని కౌన్సిలర్ తెలిపారు.

వేమానంద పీఠాధిపతికి ఘన స్వాగతం



స్వామిజీతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతి

హిందూపురం: చౌళూరు గ్రామంలో కర్ణాటక హరిహర మఠం పీఠాధిపతి హేమనంద స్వామిజికి ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతి కుటుంబం ఘనంగా స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, చౌళూరు రామకృష్ణారెడ్డి తండ్రి నంజుడరెడ్డి విదురాశ్వత్తంలో ఉమ్మడి ఆస్తిని గురుకులం నిర్మాణానికి, రెడ్డి జన సంఘకు దానం చేయడానికి కుటుంబసభ్యులు నిర్ణయించుకున్నారు. ఈమేరకు పీఠాధిపతి వేమనానంద స్వామిజీ చౌళూరుకు విచ్చేశారు. అనంతరం చౌళూరు నంజుడరెడ్డి ఇంటికి కూడా స్వామిజీ వెళ్లారు. ఈసందర్భంగా కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, గౌరీబదనూర్ మాజీ ఎమ్మెల్యే శివశంకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఎమ్మెల్యే జనతా సందర్శన



ప్రజల సమస్యలను తెలుసు కుంటున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఎమ్మెల్యే పదవి చేపట్టిన నేపథ్యంలో స్వగృహంలో తొలిసారిగా ఆదివారం ఏర్పాటు చేసిన జనతా సందర్శనం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమకు హాస్టల్ వసతి కల్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలకు కేఎస్ఆర్టీసీ బస్సులు రాక పోవడంతో పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల కు సరైన వేళలకు హాజరు కాలేక పోతున్నామని వాపోయారు. దీంతో విద్యాభ్యాసానికి ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజలు సైతం బస్సులు రాకపోవడంపై ఎమ్మెల్యే కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే వెంకటేశ్ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే తగినన్ని బస్సులను గ్రామీణ ప్రాంతాలకు నడపాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. హాస్టల్ సీట్లను అందేలా ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే విద్యార్థులకు హామీ ఇచ్చారు.

జగనన్న పథకాలు దేశానికే ఆదర్శం

● ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



గౌరాజుపల్లిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: జగనన్న పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గౌరాజుపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామాల్లో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ గడప గడపకూ తిరిగారు. వలంటీర్లు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా? అని ఆరాతీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు ఇంటి ముంగిటకే అందుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిద్దుకోవాలని ఎమ్మెల్యే మహిళలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఎంపీటీసీ వీరేష్, ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, కలిపి సింగిల్ విండో చైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, కేపీ శ్రీనివాసులు, ఏఓ నివేదిత, ముఖ్య నాయకులు ఎస్ నారాయణరెడ్డి, సచివాలయల సిబ్బంది, వలంటీర్లు, స్థానిక నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలం పరిశీలన

మండల కేంద్రంలోని పెద్దాంజనేయస్వామి ఆలయ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు ఆనుకొని ఉన్న ఆలయ స్థలం పోలీస్ శాఖకు తీసుకొని, ఆయాలనికి ఆనుకొని ఉన్న పోలీస్ శాఖ స్థలాన్ని ఆలయానికి ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని అర్చకుడు గిరీష్‌స్వామి, శ్రీరామ భక్త మండలి సభ్యులు ఎమ్మెల్యేకు విన్నవించాడు. దీంతో స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.

డ్రిప్ మెటీరియల్ పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఓఎస్డీ, పీడీ సుదర్శన్

పెనుకొండ: అర్హులైన రైతులకు 9,347 హెక్టార్లలో డ్రిప్ పరికరాలు అందజేసినట్లు ఇరిగేషన్ పీడీ సుదర్శన్, ఓఎస్డీ వైవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని హార్టికల్చర్ కార్యాలయంలో ఇరిగేషన్ ఇంజనీర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం 2022–23 సంవత్సరానికి 8 వేల హెక్టార్లకు అనుమతి మంజూరు చేసిందని, రైతులు 9,347 హెక్టార్లకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. మరో 224 హెక్టార్లకు అదనంగా మెటీరియల్ అందజేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం 10 వేల ఎకరాలకు డ్రిప్ అందజేయాలన్న నిర్ణయంలో ఉందని రైతులు తమ పేర్లను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కంపెనీల ఇంజనీర్లతో డ్రిప్పు పంపిణీ, వాటిని ఎంత మందికి వినియోగించారు అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వినియోగం చేశారు. మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాలైన శిర, హిరియూర్, మధుగిరి, పావగడ, చెళ్లకెర, తుమకూరు, బెంగళూరు తదితర పట్టణాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం



సాయినాథుడిని ఊరేగిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. షిర్డీసాయి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయంలో షిర్డీసాయి సత్యవ్రతాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆ తర్వాత సాయినాథుని వెండి పల్లకీలో ఉంచి వందలాది మంది భక్తుల సమక్షంలో మంగళ వాయిద్యాలతో పట్టణంలో ఊరేగించారు. ఈసందర్భంగా కళాకారుల నృత్యాలు పుర ప్రజలను ఆకట్టుకున్నాయి. పావగడ తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తన మహిళల భక్త బృందం, మడకశిర షిర్డీసాయి సంకీర్తన మహిళల భక్త బృందం, కల్లుమర్రి, బుళ్లసముద్రం, చీపులేటి భజన మండలి బృందం భక్తిగీతాలతో ముందుకు సాగాయి.

నేటి కార్యక్రమాలు

గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం ఆలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, 9.30 గంటలకు ఉత్సవ మూర్తికి సామూహిక క్షీరాభిషేకం,పుష్పాభిషేకం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు సాయినాథునికి హారతి, భక్తులకు అన్నసంతర్పణ జరుగుతుందని తెలిపారు. సాయంకాలం బాగేపల్లికి చెందిన శ్రీహరిరాజు హరికథ కాలక్షేపం ఉంటుందని వివరించారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన తహసీల్దార్



హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుజాత

పావగడ: పట్టణంలోని ప్రభుత్వ హాస్టళ్లను తహసీల్దార్ కేఎన్ సుజాత ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత స్థానిక దేవరాజ్ అర్స్ బీసీ బాలికల హాస్టల్ వెళ్లి విద్యార్థినుల హాజరు పట్టికను పరిశీలించారు. వంట గదిని పరిశీలించి కంది బేడల్లో పురుగులుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూరగాయలు లేక పోవడంపై వార్డెన్‌ను ప్రశ్నించారు. హాస్టల్ శౌచాలయాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఎస్సీ ఎస్టీ బాలల హాస్టల్ ను పరిశీలించారు. అక్కడ శౌచాలయం లేకపోవడంపై మండిపడ్డారు. హాస్టల్ వార్డెన్ హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే హాస్టల్ భవనంలో కేవలం భోజన వసతి మాత్రమే సౌకర్యం చేశారని విద్యార్థులు బస చేసేందుకు ప్రత్యేక గదులను బాడుగకు తీసుకున్నారని ఆమె గమనించారు. ఇందిరా క్యాంటీన్‌ను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



లక్ష్మీ పాండురంగస్వామి ఉత్సవమూర్తులకు ప్రాకారోత్సవం చేస్తున్న దృశ్యం

హిందూపురం: స్థానిక పాండురంగనగర్‌లోని భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం పాండురంగస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో లక్ష్మీపాండురంగ స్వామికి పంచామృతాభిషేకాలు, విశేషపూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శాంతిహోమాలు పూర్ణహుతి నిర్వహించారు. అలాగే లక్ష్మీపాండురంగస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి కల్యాణోత్సవం చేశారు. తర్వాత ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి మేళతాళాలతో ప్రాకారోత్సవం చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రాంప్రకాష్, ఉపాధ్యక్షులు జగన్నాథరావు, సత్యనారాయణరావు, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి టీడీపీ నాయకుల అడ్డంకులు



రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్న గ్రామస్తులు

సోమందేపల్లి: మండలంలోని పత్తికుంటపల్లిలో ప్రభుత్వ పాఠశాల సమీపంలో రోడ్డు నిర్మాణానికి రూ.1.50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇటీవల గ్రామస్తులు అధికారులకు అర్జీలు ఇచ్చారు. స్పందించిన అధికారులు.. 50 మీటర్ల రోడ్డు నిర్మాణానికి గ్రామ పంచాయతీ ఆమోదం తీసుకున్నారు. రెండురోజుల క్రితంరోడ్డు పనులు ప్రారంభించడానికి అధికారులు సిద్ధమయ్యారు. కానీ ఓ టీడీపీ నాయకుడు రోడ్డు నిర్మాణం చేపట్టకూడదని అడ్డుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో టీడీపీ నాయకుడే సర్పంచ్‌గా ఉన్నా రోడ్డు పనులకు అడ్డుపడుతున్నట్లు సర్పంచ్ నిర్మలమ్మ తెలిపారు. కాగా తహసీల్దార్ సురేష్ కుమార్‌తోపాటు ఎస్ఐ విజయ్‌కుమార్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు రావులను ఓ టీడీపీ నాయకుడు ఫోన్ చేసి ఆరు నెలల్లో టీడీపీ ప్రభుత్వం వస్తుందని రోడ్డు నిర్మాణం చేపడితే మీ అంతుచూస్తానని హెచ్చరించినట్లు సమాచారం. గ్రామ కంఠం భూమిలో రోడ్డు నిర్మిస్తుంటే కేవలం రాజకీయ లబ్ధికోసం అడ్డుపడటం తగదని గ్రామస్తులు శ్రీనివాసులు రామకృష్ణ, నజ్మ, నాగవేణి, వెంకట శివారెడ్డి, హనుమంత రెడ్డి, సూర్యనారాయణ రెడ్డిలు తెలిపారు.

రెగ్యులర్ ఎంఈఓగా శ్రీనివాసభాస్కర్

మడకశిర: మడకశిర రెగ్యులర్ ఎంఈఓగా శ్రీనివాసభాస్కర్ నియమితు లయ్యారు. ఈయన మడకశిర ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. ఇటీవల ఇతనిని మడకశిర ఇన్‌చార్జ్ ఎంఈఓగా నియమించారు. అయితే సంబంధిత ఉన్నతాధికారులు పలువురు హెచ్‌ఎంలకు ఎంఈఓలుగా పదోన్నతి కల్పించారు. ఇందులో భాగంగా శ్రీనివాస భాస్కర్ మడకశిర రెగ్యులర్ ఎంఈఓగా నియమితు లయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధి కృషి చేస్తానని తెలిపారు.

864 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం



పట్టుబడిన మద్యం చూపుతున్న పోలీసులు

సోమందేపల్లి: మండలంలోని వెలుగుమాకులపల్లి క్రాస్ వద్ద 864 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. చిలమత్తూరు మండలం కోడూరుకు చెందిన మనోహర్, కిష్టప్ప అనే ఇద్దరు కారులో కర్ణాటక మద్యం తెస్తుండగా పట్టుబడ్డారు. కిష్టప్ప అనే వ్యక్తి పరారీ కాగా, మనోహర్ ను అదుపులోకి తీసుకున్నారు. 864 టెట్రా మద్యం ప్యాకెట్లతో పాటు కారును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా కలశ పూజోత్సవం



మంగళవాయిద్యాల నడుమ కలశాలతో తరలివస్తున్న మహిళలు

హిందూపురం: షిర్డీ శేషసాయి సంస్థాన్ ఆలయంలో గురుపౌర్ణిమ, 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కలశ, జలాభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. స్థానిక సత్యనారాయణపేటలోని షిర్డీ శేష సాయినాథుడికి విశేష పూజలు చేపట్టారు. అనంతరం మహిళలు 108 కలశాలతో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తరలివచ్చి శేష సాయి సంస్థాన్ మూలవిరాట్ సత్యసాయిబాబా విగ్రహానికి జలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం కాగడ హారతి అందించి వచన మహిళా గ్రూపు సభ్యులచే సాయి నామ సంకీర్తనలు చేసి శేజ హారతి అందించారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి సాయి నాథుడికి పూజలు చేపట్టారు.

నేటి నుంచి కొల్హాపురి మహాలక్ష్మి జాతర

అగళి: ఇరిగేపల్లిలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారి జాతర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.సోమవారం సాయంత్రం బ్యాడిగెర నుంచి అమ్మవారిని ఊరేగింపుగా ఇరిగేపల్లికి తీసుకొస్తామన్నారు. మంగళవారం అమ్మవారికి జోత్యుల ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని సర్పంచ్ లక్ష్మమ్మ కోరారు.

వైద్య శిబిరం

గుడిబండ: మోరుబాగల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ సుధాకర్ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 194 మందికి చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ఉబెద్, పీఆర్‌ఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

అగళి : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి 1.30 గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. డివిజన్ స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన సూచించారు.

జాబిలికి కొలకలూరి జాతీయ కవితా పురస్కారం



చాంద్‌బాషా

పెనుకొండ: పట్టణానికి చెందిన కవి జాబిలి చాంద్ బాషాకు పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ జాతీయ కవితా పురస్కారం లభించింది. ఈ మేరకు ఆయనకు ఆదివారం సైమన్‌ఫౌండేషన్ నుంచి సమాచారం అందింది. జాబిలి చాంద్‌బాషా రచించిన 'మట్టిని ముద్దాడిన మనిషి' అన్న కవితకు ఈ పురస్కారం లభించింది. ఈనెల 9న హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన పురస్కారం అందుకోనున్నారు.

'దళితులను ఆలయంలోకి రానివ్వట్లేదు'

పావగడ: వైఎన్ హొసకోట పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ అర్జున్ గౌడ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎస్సీ ఎస్టీ వర్గాల ప్రజావాణి కార్యక్రమంలో దళితులను గురు రాఘవేంద్ర ఆలయంలోకి రానివ్వట్లేదని స్థానిక దళిత నాయకుడు ఎ.ఎస్ యోగీశ్ ఆరోపించారు. ఆలయ సమితి పదాధికారులతో మాట్లాడి తగిన చర్యలు చేపడతానని ఈ సందర్భంగా ఎస్ఐ పేర్కొన్నారు.

పెద్దచెరువు మరువకు మరమ్మతు

రొద్దం: గత ఏడాది భారీ వర్షాలకు రొద్దం పెద్దచెరువు మరువ ధ్వంసమై పూర్తిగా దెబ్బతినింది. దీంతో మరువ ప్రమాదంగా మారడంతో ఆయకట్టు రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే శంకరనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే చెరువు మరువకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. ఆదివారం అధికారులు జేసీబీ ఏర్పాటు చేసి ధ్వంసమైన మరువకు మరమ్మతు చేపట్టారు. పనులను ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, నాయకులు నరసింహులు, రాము పరిశీలించారు.

యూటీఎఫ్ నాయకుల సమావేశం

పెనుకొండ: జీపీఎస్ వద్దు.. ఓపీఎస్‌ను ప్రవేశపెట్టాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలో యూటీఎఫ్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్పొరేట్లకు మేలు చేసే జీపీఎస్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేసి ఓపీఎస్‌ను ప్రవేశపెట్టాలన్నారు. సమావేశంలో నాయకులు సుధాకర్, నారాయణస్వామి, నాగేంద్ర, భూతప్ప, బాబు, మారుతిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

సోమందేపల్లి: మండల కేంద్రంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మంగళ శివ అనే వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. అతని నుంచి 30 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గురుపౌర్ణమి వేడుకలకు సిద్ధం

అమరాపురం: మండల కేంద్రంలో వెలసిన షిర్డీసాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం నుంచి సాయంకాలం వరకూ వివిధ రకాల పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు హరీష్ భట్టాచార్యులు పేర్కొన్నారు. పూజలో పాల్గొనే మహిళలు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

డిపోలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి

మడకశిర: ఆర్టీసీ డిపోలో సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి అధికారులను కోరారు. ఆదివారం డిపో ఆవరణలో ఎన్ఎంయూ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో మహిళా కండక్టర్లకు ప్రత్యేక విశ్రాంతి గది ఏర్పాటు చేయాలన్నారు. సైకిల్ స్టాండ్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను కల్పించాలన్నారు. శ్రీశైలం సరీ్వసుకు మూడు రోజుల మస్టర్ ఇవ్వాలని కోరారు. జోనల్ కోశాధికారి సుబ్బరాయుడు, హిందూపురం డిపో చైర్మన్ కిరణ్‌కుమార్, కార్యదర్శి రంగనాథ్, స్థానిక నాయకులు రామచంద్ర, కరియప్ప, రామకృష్ణ, జయసింహా, ముద్దప్ప, పురుషోత్తం, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మండల విద్యాధికారిగా జాన్‌రెడ్డెప్ప



గోరంట్ల: మండల విద్యాధికారి–1గా కదిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాన్ రెడ్డప్పను నియమించారు. రెండేళ్లకు పైగా రెగ్యులర్ ఎంఈఓ లేరు. గోరంట్ల మండలానికి చెందిన రెగ్యులర్ మండల విద్యాశాఖ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌చార్జ్ గా బుక్కపట్నం మండల విద్యాశాఖ అధికారి విధులు నిర్వహించేవారు. అయితే ప్రభుత్వం సీనియర్ ప్రధానోపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి, గోరంట్ల ఎంఈఓగా జాన్‌రెడ్డప్పను నియమించారు. గతంలో అమడగూరు ఇన్‌చార్జ్ మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహించారు.

రెండో పట్టణ సీఐగా శ్రీనివాసులు



హిందూపురం అర్బన్: రెండో పట్టణ సీఐగా శ్రీనివాసులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం డీఎస్పీ కంజాక్షన్‌ను మర్యాద పూర్వకంగా కలసి శాంతిభద్రతలపై చర్చించారు.